క్లుప్తంగా

పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. నస్పూర్‌లోని 6, 16, 17వార్డుల్లో రూ.75లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణానికి ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. పట్టణంలో మౌలిక వసతుల ఏర్పాటుకు అధిక నిధులు కేటాయిస్తున్నట్లు, అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్ పూదరి కుమార్, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పోడు భూములకు పట్టాలు పంపిణీ

చెన్నూర్: పట్టణంలోని సంతోషిమాత ఫంక్షన్ హాల్లో సోమవారం ఉదయం 11గంటలకు నియోజకవర్గంలోని 1,190ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్న 666మంది పోడు రైతులకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పట్టాలను పంపిణీ చేయనున్నారు. పట్టాల పంపిణీకి నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని ఓ భూ వివాదం రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించడమే కాదు, అధికారులపై దురుసుగా వ్యవహరించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గుడిపేట శివారులోని సర్వే నంబర్ 300లోని దాదాపు ఐదు ఎకరాల స్థలాన్ని ఒకరు ఆక్రమించి కబ్జా చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని సర్వే జరిపి, తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తమకు భూమి కేటాయించేలా ఆర్డీఓకు అనుకూలంగా నివేదిక ఇవ్వాలంటూ ప్రభుత్వ భూమి ఆక్రమించిన వ్యక్తితో పాటు అనుచరులు ఇటీవల హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి నానా రాద్ధాంతం చేసినట్లు తెలిసింది. తహసీల్దార్ రాజలింగు, నాయబ్ తహసీల్దార్ హరిత, సీనియర్ అసిస్టెంట్ ప్రభులింగంలతో పాటు రెవెన్యూ సిబ్బంది విధులకు ఆటంకం కలిగేలా వ్యవహరిస్తూ తీవ్ర అసభ్య పదజాలంతో దూషిస్తూ అధికారులతో దురుసుగా వ్యవహరించినట్లు సమాచారం. ఈ ఘటనపై తహసీల్దార్ రాజలింగును వివరణ కోరగా వాస్తవమని ధ్రువీకరించారు.

ఘనంగా చార్టెడ్ అకౌంటెంట్ డే

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ వాసవిక్లబ్ పిలుపు మేరకు చార్టెడ్ అకౌంటెంట్ డే ను పురస్కరించుకుని వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్ గడ్డం సూర్యప్రకాశ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అక్కినేపల్లి రవీందర్, గౌరిశెట్టి ధనలక్ష్మి, వాసవిక్లబ్ అధ్యక్షుడు అయిత శ్రీనివాస్, వనితా క్లబ్ అధ్యక్షురాలు సరిత పాల్గొన్నారు.

సెలవులో ఎంపీపీ.. వైస్ ఎంపీపీకి బాధ్యతలు

భీమిని: కన్నెపల్లి మండల ఎంపీపీ మాదవరపు స్రృజనరావు నాలుగు నెలలు సెలవుపై వెళ్లడంతో, వైస్ ఎంపీపీ రాకేష్‌శర్మ ఈ నాలుగు నెలలు ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ రాధాకిషన్ ఆదివారం తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు సెలవు పెట్టినట్లు పేర్కొన్నారు.

కొవ్వొత్తులతో చిన్నారికి నివాళి

బెల్లంపల్లి: మూడు నెలల శిశువు వైద్యం వికటించి మృతి చెందిన ఘటనకు నిరసనగా ఆదివారం రాత్రి బెల్లంపల్లిలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ ఏరియా నుంచి ప్రారంభమైన ర్యాలీ బజారు ఏరియా పుర వీధుల మీదుగా కాంటా చౌరస్తా వరకు సాగింది. అంబేద్కర్ విగ్రహం వద్ద శిశువు చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించి సంతాపం ప్రకటించారు. అంతకు ముందు నిర్లక్ష్యంగా వైద్యం చేసిన నిత్య పిల్లల ఆసుపత్రి వైద్యుడు శ్రీకాంత్‌రెడ్డిపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, పిల్లల ఆసుపత్రిని సీజ్ చేయాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం కృష్ణ మందిర్ రోడ్‌లో ఉన్న నిత్య పిల్లల ఆసుపత్రి వద్దకు వచ్చి రోడ్డుపై ఆందోళన చేశారు. వన్‌టౌన్ పోలీసులు వచ్చి ఆందోళన చేస్తున్న విద్యార్థి, యువజనులను అదుపులోకి తీసుకున్నారు.

అందుబాటులో ఫిజియోథెరపి

- ఆర్కే 8 డిస్పెన్సరీలో ఏర్పాటు
- సింగరేణి కుటుంబాలకు తగ్గిన దూరభారం


నడుం నొప్పికి ట్రాక్షన్ చేస్తున్న సిబ్బంది

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఫిజియోథెరపి కష్టాలు తప్పాయి. ఇన్నాళ్లు కిలోమీటర్ల దూరం వెళ్లి ఫిజియోథెరపి చేయించుకున్న వారికి, నేడు అందుబాటులో కాలనీ మధ్య గల ఆర్కే 8 డిస్పెన్సరీలో ఫిజియోథెరఫి కేంద్రం ఏర్పాటు కావడంతో ఎంతో సౌలభ్యంగా మారింది. ఫిజియోథెరపి అవసరం ఉన్న వారు ఇన్నేళ్ల నుంచి రామకృష్ణపూర్‌లోని కంపెనీ ఏరియా ఆసుపత్రిలో ఉండే కేంద్రానికి వెళ్లేవారు. శ్రీరాంపూర్ ఏరియాలో పని చేసే కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు స్థానికంగా ఈ కేంద్రం లేకపోవడంతో 12కిలోమీటర్ల దూరంలో ఉన్నా, రామకృష్ణపూర్ ఏరియా ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాల్సి వచ్చేది. దీంతో ఈ ఏరియా వారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. భూగర్భంలో పని చేయడం వల్ల చాలా మంది సీనియర్ కార్మికులు నడుం నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడుతుంటారు. దీనికి తోడు పక్ష వాతం లక్షణాలు, మోకీళ్ల, నరాల జబ్బుల వారిని వైద్యులు ఫిజియోథెరఫీకి రిఫర్ చేసేవారు. గని ప్రమాదాల్లో గాయాలపాలై, ఎముకలు దెబ్బతిన్న వారు, శస్త్ర చికిత్సల అనంతరం కొందరికి ఫిజియోథెరపి అవసరం ఉంటుంది. కంపెనీలోనే పెద్ద ఏరియా కావడతో శ్రీరాంపూర్ నుంచి ఈ కేసులు సంబంధించిన వారు నిత్యం రామకృష్ణపూర్ ఏరియా ఆసుపత్రికి వెళ్లి ఉదయం, సాయంత్రం వేళల్లో ఫిజియోథెరపి చేయించుకొని వచ్చేవారు. మందమర్రి, శ్రీరాంపూర్ నుంచి పెద్ద ఎత్తున కేసులు ఎక్కువగా ఉండటంతో, అక్కడ కూడా రోగుల తాకిడి ఎక్కువగా ఉండేది. గంట సమయం ఫిజియోథెరపి కోసం వెళ్లిన కూడా దూర భారం, వేచి ఉండే సమయంతో కలిసి కనీసం పూట సమయం గడిచేది. దీంతో చాలా మంది సమీపంలోని మంచిర్యాల పట్టణంలోని ప్రైవేటు కేంద్రాలకు వెళ్లి జేబులు గుల్ల చేసుకోవాల్సి వచ్చేది. ప్రైవేటు కేంద్రాల్లో గంటకు రూ.300వసూలు చేస్తున్నారు. ఈ ఇబ్బందులను కార్మికులు, గుర్తింపు సంఘం నాయకులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో ఇటీవల ఆర్కే 8 డిస్పెన్సరీలో ప్రత్యేక గదిలో ఫిజియోథెరపి కేంద్రంను ఏర్పాటు చేశారు. దీంతో ఈ చికిత్సల వారికి సౌలభ్యం పెరిగింది.

ప్రైవేటుకు దీటుగా ఎక్విప్‌మెంట్ ...

ప్రైవేటుకు దీటుగా కంపెనీ ఫిజియోథెరఫీకి ఇక్కడ ఆధునిక ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేసింది. ఉదయం 7:30నుంచి 12:30గంటలు, సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు ఇక్కడ ఫిజియోథెరపి చేస్తున్నారు. ప్రత్యేక ఫిజియోథెరపిస్ట్, శిక్షణ పొందిన సిబ్బందితో సేవలు అందిస్తున్నారు. అల్ట్రాసౌండ్ మస్సాజ్, ఐఎఫ్‌టీ, పుల్లర్స్, షోల్డర్ వీల్, ఇన్ఫ్రారెడ్ ల్యాంప్స్, సైకిల్, సర్వైకల్ ట్రాక్షన్, ఇతర వ్యాయామాలు చేసే పరికాలు ఉన్నాయి.

జీఎం కృషితో ఇబ్బంది తీరింది



చాలా కాలంగా ఈ సౌకర్యం స్థానికంగా లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ ఇబ్బందిని ఏరియా జీఎం సంజీవరెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో ఆయన స్పందించి వెంటనే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉద్యోగుల నుంచి మొదలుకొని అధికారులు, వారి కుటుంబ సభ్యులు నిత్యం వచ్చి ఫిజియోథెరపి చేయించుకుంటున్నారు. ఇప్పటివరకు మంచిర్యాల ప్రైవేట్ క్లీనిక్‌లకు వెళ్లే వారు కూడా, ఇప్పుడు కంపెనీ దవాఖానా దారి పడుతున్నారు.

- డాక్టర్ రమేశ్‌బాబు(డీవైసీఎంఓ)

జన్నారం ఫారెస్ట్‌లో ఎంపీటీసీల స్టడీ టూర్


సఫారీల్లో అడవిలోకి వెళ్తున్న ఎంపీటీసీలు

జన్నారం: అటవీశాఖలో జరుగుతున్న అభివృద్ధి, అడవులపై అవగాహన కోసం జన్నారం ఎంపీపీ మాదాడి సరోజన ఆధ్వర్యంలో మండలంలోని ఎంపీటీసీలు ఆదివారం అడవి స్టడీ టూర్ చేశారు. జన్నారం అటవీ డివిజన్‌లోని గేట్ నంబర్ 1 నుంచి సఫారీల ద్వారా అడవిలోకి వెళ్లారు. అడవిలో జరుగుతున్న అభివృద్ధి, గడ్డి క్షేత్రాలు, నీటి కుంటలు, వన్యప్రాణులకు కల్పిస్తున్న సౌకర్యాలు పరిశీలించారు. రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ, డిప్యూటి రేంజ్ అధికారి తిరుపతి ఎంపీటీసీలకు వివరాలు తెలియజేశారు. బైసన్‌కుంట, గొండుగూడ బేస్‌క్యాంప్, నీలుగాయి కుంట ప్రాంతాల్లో పర్యటించి, అడవుల అందాలను తిలకించారు. అనంతరం వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

బోదకాలు నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్లు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్ బోదకాలు నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోదకాలు వ్యాధిపై నిర్లక్ష్యం తగదని, క్యూలెక్స్ ఆడదోమ కాటు వల్ల మైక్రో ఫైలేరియా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. మైక్రో ఫైలేరియా మానవ శరీరంలోకి ప్రవేశించిన తరువాత బోదకాలు లక్షణాలు బయట పడడానికి 10 నుంచి 15సంవత్సరాల సమయం పడుతుందని తెలిపారు. సమాజం నుంచి బోదకాలును పారద్రోలేందుకు ప్రభుత్వం 'మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని, అందులో 2సంవత్సరాలు పైబడిన వారికి డీఈసీ, అల్బెండాజోల్ మాత్రలు మింగిస్తారని, 5సంవత్సరాలకు పైబడి, 3ఫీట్ల ఎత్తుకన్నా పొడవైన వారికి ఐవర్ మెక్టిన్ మాత్రలు మింగిస్తే, ఈ మూడు మాత్రల వల్ల మైక్రోఫైలేరియాలు చనిపోతాయని వివరించారు. వీటివల్ల బోదకాలు వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైజినిక్ కిట్లు అందజేత



బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని అమ్మ అనాథ శరణాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం హైజినిక్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్‌సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. పరిశుభ్రతపై పిల్లలు అవగాహన పెంచుకోవాలన్నారు. పరిసరాలను పరిశ్రుభంగా ఉంచుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, సభ్యులు సూరం లక్ష్మీనారాయణ, రంజిత్‌కుమార్, అమ్మ శరణాలయం శిశు సంరక్షణ సొసైటీ ఇన్‌చార్జి దుర్గం భాగ్యలక్ష్మి, చిన్నారులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల నిల్వలకు కృషి

తాండూర్: రైతులు పండించిన పంట ఉత్పత్తులకు మద్దతు ధర వచ్చే వరకు నిల్వ ఉంచుకునేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా అన్నారు. మండలంలోని రేచినీ మార్కెట్ కమిటీ గిడ్డంగి ఆవరణలో ఆదివారం రూ.38లక్షల అంచనాతో నిర్మించనున్న సీసీ రోడ్లకు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంతోష్‌తో కలిసి భూమిపూజ చేశారు.


స్థానికులతో మార్కెట్ కమిటీ చైర్మన్

వైద్య శిబిరానికి స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు రాహుల్

జన్నారం: మండలంలోని కలమడుగులో శ్వేత ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 600పైగా మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఉచిత వైద్య శిబిరం

దండేపల్లి: మండలంలోని తానిమడుగులో చార్వాక డంబ్ అండ్ డెఫ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయగా, విశేష స్పందన లభించింది. రోగులకు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ నీలకంటేశ్వర్‌రావు, వైద్యులు శ్రీనివాస్, ప్రతాప్‌గౌడ్ వైద్య పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు అందించారు.

మిషన్ భగీరథ లీకేజీని అరికట్టరూ..!



కాసిపేట: బెల్లంపల్లి మండలం సోమగూడెం చౌరస్తాలో వారం రోజుల నుంచి మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. రోడ్డంతా బురదగా మారి ఆ ప్రాంతం అధ్వానంగా మారుతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గోరింటాకు వేడుక



వనితావాక్కు ఫౌండేషన్, నందగోపాల టీం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గోరింటాకు సంబురాలు, ఆషాఢమాస వనభోజనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనితావాక్కు ఫౌండేషన్, నందగోపాల టీం సభ్యులు మాట్లాడుతూ.. ఆషాఢమాసంలో పెట్టుకునే గోరింటాకు వల్ల మహిళలకు అందంతో పాటు ఆరోగ్యం చేకూరుతుందని, అందరూ కలిసి ఒకే చోట చేరి వనభోజనాలు చేయడం వల్ల స్నేహ సంబంధాలు పెరుగుతాయన్నారు. మన పెద్దలు అందించిన మన సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో నందగోపాల టీం సభ్యులు, వనితా వాక్కు ఫౌండేషన్ సభ్యులు జ్యోత్స్న, చంద్రదత్ పాల్గొన్నారు.

- పాతమంచిర్యాల

దీవించమ్మా.. పోచమ్మ తల్లి

- వైభవంగా బోనాల ఊరేగింపు
- ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు


బోనాలతో వస్తున్న మహిళలు, పోతురాజులు


లంబాడిపల్లిలో బోనాలతో ఊరేగింపు

మంచిర్యాలఅర్బన్: ఆషాడమాసం పురస్కరించుకుని ఆదివారం స్థానిక జన్మభూమినగర్ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల ఊరేగింపు వైభవంగా జరిగింది. పసుపు, కుంకుమ, వేపకొమ్మలతో అందంగా అలంకరించిన బోనాలను మహిళలు తలపై పెట్టుకుని గీత భవన్ హోటల్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు పురవీధుల మీదుగా రాముని చెరువు కట్ట పోచమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు సాగింది. డప్పుచప్పుళ్ల మధ్య పోతురాజుల విన్యాసాలు ఎంతగానూ ఆకట్టుకున్నాయి. అనంతరం పోచమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, మహిళ శిశుసంక్షేమ మాజీ కో-ఆర్డినేటర్ అత్తి సరోజ, జన్మభూమినగర్ నివాసితుల సంక్షేమ సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబాడిపల్లిలో ప్రజలు ఆదివారం పోచమ్మ బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో బోనాలు వండి డప్పు సప్పుళ్ల మధ్య ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్లారు. తీపి వంటకాలు అమ్మవారికి నైవేద్యంగా పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సంవృద్ధిగా పండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీప్రియ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మధునం పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి



మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు ఊరు రామకృష్ణాపూర్‌లో ఆదివారం మధునం పోచమ్మ బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలు నెత్తిన పెట్టుకుని, డప్పు సప్పుళ్లతో నృత్యాలు, విన్యాసాలు చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. అమ్మ వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండాలని, వర్షాలు పడాలని పోచమ్మను వేడుకున్నారు.



బుర్రి పోచమ్మకు మొక్కులు

నెన్నెల: మండలంలోని మైలారంలో గిరిజనుల ఆధ్వర్యంలో ఆదివారం బుర్రి పోచమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలంతా పోచమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని బుర్రి పోచమ్మ తల్లిని వేడుకున్నారు. పిల్లా, పాపలతో సల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రేంసాగర్‌గౌడ్, కొయ్యడ శ్రీనివాస్, అశోక్‌గౌడ్, సర్పంచ్ లక్ష్మి, మాజీ ఎంపీటీసీ అతిమల చిలుకయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర పథకాలపై ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం మహజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గడపగడపకూ బీజేపీ నినాదంతో కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంచుతూ ప్రచారం నిర్వహించారు. బీజేపీ సంక్షేమ పథకాలు సామాన్యులకు అండగా ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి సూరం సంపత్‌కుమార్, స్వల్పకాలిక విస్తారక్ ముత్యాల శివ, బెల్లంపల్లి అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ భుక్య అరవింద్, బీజేవైఎం మండలాధ్యక్షుడు ప్రసన్న, మైనార్టీ మోర్చ మండలాధ్యక్షుడు యూసుఫ్, నాయకులు పెద్దపల్లి శంకర్, తిరుపతి, రితీష్, మహిళ నాయకులు సాయికీర్తన, స్వప్న, సుశీల తదితరులున్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని మూడో జోన్ రామాలయం ఏరియాలో ఇంటింటికీ ప్రచారంలో భాగంగా ఆదివారం బీజేపీ నాయకులు ప్రచారం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రజాపంథా పార్టీలో చేరికలు

పాతమంచిర్యాల: సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ జనరల్ బాడీ సమావేశం ఆ పార్టీ రాష్ట్ర సెక్రెటేరియట్ సభ్యురాలు రమ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

మేదరి కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తా

జన్నారం: మేదరి కులస్తుల సంక్షేమం కోసం తనవంతుగా కృషి చేస్తానని మహేంద్ర సంఘం రాష్ట్ర కమిటీ ముఖ్య సలహాదారుడు ఎంఆర్ నర్సింగరావు పేర్కొన్నారు.

క్షీరాభిషేకం

చెన్నూర్‌రూరల్: గ్రామ పంచాయతీలకు రూ.10లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినందునా మండలంలోని ముత్తరావుపల్లిలో ఆదివారం సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

మైసమ్మకు పూజలు

దండేపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రోడ్డు మైసమ్మ పూజలు ఘనంగా నిర్వహించారు.

కార్యవర్గం ఎన్నిక

జన్నారం: మండల పూసల కమిటీ కార్యవర్గాన్ని ఆదివారం నియమించారు. అధ్యక్షుడిగా ముద్రకేల రవి ఎన్నికయ్యారు.

సభకు తరలివెళ్లిన కాంగ్రెస్‌శ్రేణులు

భీమారం/జైపూర్: ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన తెలంగాణ జనగర్జన సభకి ఆదివారం భీమారం, జైపూర్ మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు.

సీఐకి సన్మానం

దండేపల్లి: మండలంలోని తానిమడుగు గ్రామానికి చెందిన భూక్య రాజేష్ ఇటీవల ఎస్సై నుంచి సీఐగా పదోన్నతి పొందారు. ఆయన ఆదివారం స్వగ్రామానికి రావడంతో గ్రామస్తులు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఘనంగా సన్మానించారు.

పంచాయతీ భవనానికి భూమిపూజ

భీమిని: కన్నెపల్లి మండలంలోని గొల్లగట్టు గ్రామపంచాయతీకి నూతనంగా పంచాయతీ భవనం మంజూరు కాగా ఆదివారం బెల్లంపల్లి ఏఎంసీ చైర్మన్ నిరంజన్‌గుప్తా భూమిపూజ చేశారు.

మొక్కలు నాటిన సత్యసాయి భక్తులు

నెన్నెల: స్థానిక ప్రాథమిక పాఠశాలలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 50మొక్కలు నాటి, చుట్టూ కంచెలు ఏర్పాటు చేశారు.

సన్మానం

పాతమంచిర్యాల: పీపుల్స్ మార్చ్ పాదయాత్ర విజయవంతమైన సందర్భంగా ఖమ్మం సభలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావును సన్మానించి అభినందించారు.